క్లుప్తంగా

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న సుబ్బలక్ష్మి ట్రస్టు సభ్యులు

కొత్తవలస: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు గొల్జాపు పెంటయ్యకు సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు వారు సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. మూడు నెలల క్రితం పెంటయ్య కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి పోవడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. బాధితుడికి సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా దాతలు వి.సునీత,డి.విజయలక్ష్మి ఆర్థిక సహాయంతో ట్రైసైకిల్ అందజేశారు. ట్రస్టు చైర్మన్ కనకాల శివ, సభ్యులు పి.శివరామకృష్ణ, వార్డు మెంబర్లు గొరపల్లి అప్పలస్వామి,గాలి అప్పారావు, కర్రి సూర్యనూకరావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



లైబ్రేరియన్ శ్రీధర్‌కు పుస్తకాలు ఇస్తున్న రైల్వేఉద్యోగి మోహన్

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి స్థానిక రైల్వే ఉద్యోగి మోపాడ మోహన్ పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశారు. గ్రూప్–2 పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రేరియన్ డి.శ్రీధర్‌కు సోమవారం అందజేశారు. దాతను లైబ్రేరియన్ అభినందించారు.

వృక్షా బంధన్



చెట్లకు రాఖీలు కడుతున్న బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఎకో క్లబ్ నేతృత్వంలో రక్షాబంధన్ వేడుకలను సోమవారం వినూత్నంగా నిర్వహించారు. రాఖీపౌర్ణమి రోజున అన్నదమ్ములకు అక్క చెల్లెళ్లు రాఖీలు కడుతుంటారు. రాఖీ పౌర్ణమి అంటే అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల పండగ మాత్రమే కాదని ఇక్కడి పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయినులు చెట్లకు రాఖీలు కట్టారు.హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ వృక్షాలు మన జీవితాలను రక్షిస్తాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. చెట్లకు రక్షణ ఇద్దాం.. చెట్ల రక్షణలో మనం బతికేద్దాం, చెట్లు మానవాళి ప్రగతికి మెట్లు అంటూ నినాదాలు చేశారు.

వర్గీకరణతో దళితుల్లో విభేదాలు



ఎస్సీ వర్గీకరణ సరికాదని నినాదాలు చేస్తున్న ఎయిమ్ సంస్థ సభ్యులు

గుర్ల: ఎస్సీ వర్గీకరణ వల్ల దళితుల మధ్య ఐక్యత దెబ్బతిని విభేదాలు వస్తాయని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ (ఎయిమ్) జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు అన్నారు. మండల కేంద్రంలో దళితులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల దళితులకు మేలుకంటే అన్యాయమే ఎక్కువ జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు దళితులంతా ఐక్యంగా ఉన్నారని, వర్గీకరణ జరిగితే ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఎస్సీ వర్గీకరణ వల్ల జరిగే పరిణామాలపై చైతన్యం చేయాలని ఎయిమ్ సంస్థ సభ్యులకు సూచించారు.

మొక్కల సంరక్షణ షేడ్ నెట్ అందజేత



గ్రీన్ షేడ్ నెట్‌ను ఉపాధ్యాయులకు అందజేస్తున్న హార్ప్స్ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కల రక్షణ కోసం హార్ప్స్ స్వచ్ఛంద సంస్థ గ్రీన్ షేడ్ నెట్‌ను సమకూర్చింది. దీన్ని పాఠశాల హెచ్‌ఎం జి.జగదీశ్వరరావుకు గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో)వ్యవస్థాపకులు రామకృష్ణ ద్వారా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, హార్ప్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

చీపురుపల్లి: గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు మంగళవారం నుంచి సెప్టెంబర్ 18 వరకు ఉచితంగా వేయనున్నట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఆర్.శారద సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువులు నీరసించిపోతాయని, పాలు ఇచ్చే పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందని చూడికట్టే సామర్థ్యం కూడా కోల్పోతాయని పేర్కొన్నారు. పాడి పెంపకందారులకు తీవ్ర నష్టం కలుగుతుందని, పాడిరైతులు అంతా స్పందించి పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



లక్కవరపుకోట: కొట్యాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



గజపతినగరం: పురిటిపెంట న్యూకాలనీలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



శృంగవరపుకోట: ఎస్.కోటలో సీఐ మూర్తికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



చీపురుపల్లి: ఆర్డీఓ శాంతికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి శాంతి



దత్తిరాజేరు: కోమటిపల్లిలో సోదరులకు రాఖీ కడుతున్న చెల్లి



కొత్తవలస: డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్‌కు రాఖీ కడుతున్న ప్రైవేట్ పాఠశాల చిన్నారులు

అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల ప్రేమ, అనురాగం, ఆప్యాయతకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పండగను పట్టణాలు, గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.కోట పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయులకు స్థానిక బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం ప్రతినిధులు శైలజ తదితరులు రాఖీలు కట్టి మిఠాయిలు పంచిపెట్టారు. చీపురుపల్లి పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమా రీస్ సేవా కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలను మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. బ్రహ్మకుమారీస్ కేంద్రం ఇన్‌చార్జి బి.కె.శాంతి ఆర్డీఓ బి.శాంతితో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, పలువురు ఉద్యోగులకు రాఖీలు కట్టారు. – సాక్షి నెట్‌వర్క్

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

- సీనియర్ సివిల్ జడ్జి విజయకల్యాణి



ఎస్.కోట సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి విజయకల్యాణి

శృంగవరపుకోట: కారాగారాల్లో ఉన్న రిమాండ్ ఖైదీలకు అవసరమైతే ఉచితంగా న్యాయసహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి చెప్పారు.స్థానిక సబ్‌జైలును సోమవారం సందర్శించారు. కారాగారం పరిసరాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు, సౌకర్యాలు, ఆహారం, ఆరోగ్యం, వంటి విషయాలతో పాటు కుటుంబ నేపథ్యాలపై ఆరా తీశారు.న్యాయ సహాయ కేంద్రం గురించి ఖైదీలకు వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఏర్పాటు చేస్తారని చెప్పారు. పారా లీగల్ వాలంటీర్, జైలు సందర్శక న్యాయవాది ప్రతీవారం జైలును సందర్శించి ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయం అందించాలని ఆదేశించారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన



గజపతినగరం: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు



వేపాడ: బొద్దాం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు



వేపాడ: వేపాడ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

గజపతినగరం: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని డిప్యూటీ డీఈఓ కె.మోహన్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో ని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అతి థిగా హాజరైన ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలస్థాయి నుంచే నైతిక విలువల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. లెసన్ ప్లానింగ్ సిద్ధం చేసుకుని బోధన చేయాలని, చదువు తో పాటు క్రీడలు, వివిధ కళల్లో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలని తెలిపారు. బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం చిప్పాడ రమేష్‌కుమార్, సీఆర్పీ రామ సూరిరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

వేపాడ: సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ–2 బాలభాస్కరరావు సూచించారు. వేపాడ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.ఎస్.వల్లీ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ–2 బాలభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. లెసన్ ప్లాన్,మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర అంశాలపై సూచనలు చేశారు. అలాగే బొద్దాం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ జగదీశ్వరరావు పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఆడపిల్లలను ఎదగనిద్దాం.. బతకనిద్దాం



ఎస్.కోట దేవీ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, కళాశాలల విద్యార్థినులు

- కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం ఘటనపై నిరసన

శృంగవరపుకోట: ఆడపిల్లలను ఎదగనిద్దాం.. చదవనిద్దాం.. బతకనిద్దాం అని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థినులు గళమెత్తారు. కోల్‌కతాలో ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని దేవీ జంక్షన్‌లో సోమవారం నిరసన తెలిపారు. ఆడపిల్లలు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్‌కోట సీఐ నారాయణమూర్తితో పాటూ పలువురు స్థానికులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ దేశంలో మహిళలపై అమానవీయ ఘటనలు, అత్యాచారాలు, హత్యలు, దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు అను, చరణ్, మండల అధ్యక్షులు రత్న, చైతు, రామునాయుడు, ప్రశాంతి, ఉమ, శివ తదితరులు పాల్గొన్నారు.



చెట్లుకు రాఖీలు కట్టి తమ నిరసన తెలుపుతున్న వివేకానంద కళాశాల విద్యార్థినులు

వినూత్న నిరసన

కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక వివేకానంద కళాశాల విద్యార్థినులు డిమాండ్ చేశారు. సోమవారం రక్షాబంధన్ సందర్భంగా వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో చెట్లకు రాఖీలు కట్టారు. మహిళలపై అత్యాచారాలకు, దాడులకు పాల్పడుతున్న వారికి పడే శిక్షలు వెన్నులో వణుకు పుట్టించేలా ఉండాలన్నారు. కోల్‌కతా ఘటనలో దోషులను దాచే ప్రయత్నం చేస్తున్నారని, పాత్రదారులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

గుర్ల: మండలంలోని చింతలపేట గ్రామంలో నెలరోజులుగా విద్యుత్ సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రామ సర్పంచ్ పతివాడ భాస్కరరావు ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో వీధి లైట్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్ ఫార్మర్‌తో పాటు వ్యవసాయ మోటార్ల కు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ పాడ య్యాయని తెలిపారు. వీటికి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ లేకపోవడంతో వరి పంటకు రైతులు నీటితడులు అందించలేకపోతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి లైట్లు వెల గక రాత్రి వేళల్లో వీధులు చీకటి మయ మవుతున్నాయని తెలిపారు. అలాగే తెట్టంగి గ్రామానికి వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతు న్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అధికారు లకు విన్నవించకుంటున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్ జమ్ము పార్వతి మండిపడుతున్నారు.

ఉపాధ్యాయుడు బొంతల కోటికి జాతీయ అవార్డు



విశాఖలో అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు శంకరరావు

గజపతినగరం: స్థానిక పురిటిపెంట న్యూకాలనీలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు బొంతలకోటి శంకరరావును అబ్దుల్ కలాం జాతీయ అవార్డు వరించింది. విద్య, సాహిత్యం,సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవలను గుర్తించి గ్లోబల్ పీస్ విశ్వవిద్యాలయం, డాక్టర్ చిన్నారావు చారిటబుల్ ట్రస్ట్ ఈ అవార్డును ప్రధానం చేసింది.లో విశాఖపట్నం సెంట్రల్ లైబ్రరిలో ఆదివారం జరిగిన కళాపోషణ కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు.ఈయన ప్రస్తుతం మెంటాడ మండలంలోని గుర్ల తమ్మిరాజుపేటలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ బొత్సను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కొత్తవలస మండల నాయకులు, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ఎమ్మెల్సీ బొత్సను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్.కోట మండల నాయకులు



ఎమ్మెల్సీ బొత్సకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న కొత్తవలస వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బొత్సను విశాఖపట్నంలోని ఆయన నివాసంలో ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో కొత్తవలస, ఎస్.కోట, వేపాడ మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్సను సోమవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

– శృంగవరపుకోట/వేపాడ/కొత్తవలస

ఓటర్ల జాబితాపై ప్రత్యేక సర్వే



లక్కవరపుకోట: బీఎల్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్ ప్రసాదరావు



జామి: బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ మురళీకృష్ణ

లక్కవరపుకోట /కొత్తవలస: గ్రామాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 18 వరకు ఓటర్ల జాబితాపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని కొత్తవలస, లక్కవరపుకోట మండలాల తహసీల్దార్‌లు బి.నీలకంఠరావు, ప్రసాదరావు బూత్‌లెవెల్ అధికారుల(బీఎల్‌ఓ)ను ఆదేశించారు. ఆయా మండలాల రెవె న్యూ కార్యాలయాల్లో బీఎల్‌ఓలతో సోమవారం సమావేశ మయ్యారు. గ్రామాల్లో ఇంటింట సర్వే చేయాలని, మృతి చెందిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల ని, చిరునామాలు, ఇతర తప్పులు ఉంటే గుర్తించాలన్నారు.అలాగే 18 ఏళ్లు నిండిన వారితో ఓటరు నమోదుకు దరఖాస్తు చేయించాలని చెప్పారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా మండలాల డీటీ లు రాజేష్,రమేష్ పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి

జామి: ఓటర్ల జాబితా సారాంశ సవరణపై మండల బీఎల్‌ఓలకు ఎస్.కోటనియోజకవర్గ ఈఆర్‌ఓ(ఓటరు నమోదు అధికారి)మురళీకృష్ణ పలు సూచనలు చేశారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఇంటింట సర్వేను సకాలంలో పూర్తి చేయాలనిఆదేశించారు. తహసీల్దార్ కృష్ణలత పాల్గొన్నారు.

బైపాస్‌ను మార్చండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

శృంగవరపుకోట: పెందుర్తి నుంచి బొడ్డవర గ్రామం వరకూ ఉన్న విశాఖ–అరకు రోడ్డును ప్రస్తుతం ప్రతి పాదించిన బైపాస్‌గా కా కుండా, వెడల్పు తగ్గించి ప్రస్తుతం ఎస్.కోట మీదుగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు, సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ నేతృత్వంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు సోమవారం నిరసన తెలిపారు. సీపీఐ నేతలు డేగల అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ బైపాస్ రోడ్డు వల్ల రైతులు తమసాగు భూములు కోల్పోతున్నారని చెప్పారు. ఈ రోడ్డు కఅరుకు వెళ్లే పర్యాటకులకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. పెందుర్తి–బొడ్డవర రోడ్డును 100 అడుగులు కాకుండా 80 అడుగులు మాత్రమే విస్తరించాలని కోరారు. బైపాస్ తప్పదనుకుంటే రైతులకు గరిష్ట పరిహారం చెల్లించాలన్నారు. రైతులకు తెలుగులో నోటీసులు ఇచ్చి ముందస్తు సమావేశాలు నిర్వహించి, వివరాలు తెలియజేయాలని కోరుతూ తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణ

బొండపల్లి: గంజాయి రవాణా కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామని గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ తెలిపారు. సోమవారం ఆయన ఎస్‌ఐ కె. లక్ష్మణరావుతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని గాయత్రీ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్న మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఒడిశా నుంచి గంజాయిని విశాఖపట్నం రవాణా చేస్తుండగా నెలివాడ గ్రామ జంక్షన్‌లో జాతీయ రహదారి–26పై పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 1,800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పవన్‌కు ఒడిశా రాష్ట్రంలోని సుంకిలో ఉంటున్న సుంకర్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి కావడంతో ఆ వక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 31 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఇ.నరసింహమూ ర్తి, డీసీఆర్‌బీ ఎస్‌ఐ గణేష్, తదితరులు పాల్గొన్నారు.